క్లుప్తంగా

యువకుడి అనుమానాస్పద మృతి


మృతుడు రాజేష్

నెల్లూరు(క్రైమ్): శరీరంపై తీవ్రగాయాలతో ఓ యువకుడు తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. శివప్రియ హోటల్ వెనుకవైపు యడ్లవారివీధిలో లక్ష్మి, చంద్ర దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి రాజేష్ (25), ఈశ్వర్ సంతానం. వివాహం కాలేదు. ఈశ్వర్ దుస్తుల దుకాణంలో పనిచేస్తున్నాడు. రాజేష్ మద్యానికి బానిసై నిత్యం ఇంట్లో గొడవలు పడుతుండేవాడు. గురువారం రాజేష్ పూటుగా మద్యం తాగాడు. ఏం జరిగిందో ఏమో తెలియదు గానీ సాయంత్రం అతను తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. తలపై, ఒంటిపై కత్తితో నరికిన గాయాలున్నాయి. ఈ విషయం రాత్రి పొద్దుపోయే వరకు బయటకు రాలేదు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై కత్తితో నరికిన గాయాలు ఉండడాన్ని గమనించారు. అయితే మృతుడి తల్లి, తమ్ముడు ఈశ్వర్ మాత్రం మద్యం తాగి తానే గాయాలు చేసుకోవడంతో రాజేష్ మృతిచెందాడని పోలీసులకు తెలిపారు. వారి మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో పోలీసులు వారిద్దరితోపాటు మృతుడి తండ్రిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి చిన్నబజారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఘటన జరిగిన తీరుపై ఆరాతీస్తున్నారు. అయిన వారే ఈ ఘాతుకానికి ఏమైనా ఒడిగట్టారా? అనే కోణంలో విచారిస్తున్నట్లు సమాచారం.

గణేష్ ఘాట్‌ను సందర్శించిన మంత్రి

నెల్లూరు(బృందావనం): నగరంలోని స్వర్ణాల చెరువు వద్ద ఉన్న గణేష్ ఘాట్‌ను గురువారం రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యనాగేశ్వరరావు, పి.సురేంద్రరెడ్డితో కలిసి సందర్శించారు. వినాయకచవితి సందర్భంగా సెప్టెంబర్ 7 నుంచి 11వ తేదీ వరకు జరిగే గణేష్ నిమజ్జన ఉత్సవాలకు సంబంధించి నెల్లూరు ఎన్టీఆర్ నెక్లెస్‌రోడ్డు, గణేష్ ఘాట్‌ను అభివృద్ధి చేసేందుకు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ, నుడా అధికారులకు మంత్రి సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ, విశ్వ హిందూ పరిషత్, హైందవ ధార్మిక సంఘాల నేతలు వంశీధర్‌రెడ్డి, మండ్ల ఈశ్వరయ్య, యశ్వంత్ సింగ్, జి.విజయకుమార్ ఏవీఆర్ మోహన్‌రావు, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, ఉత్సవ సమితి నిర్వాహకులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

నెల్లూరు(బారకాసు): మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కమిషనర్ సూర్యతేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొదలకూరురోడ్డులోని జెడ్పీ కార్యాలయ సమీపంలో ఉన్న రెవెన్యూ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న పైపులైనులో ఏర్పడిన లీకులకు 2వ తేదీ సాయంత్రం మరమ్మతులు చేపడుతున్నట్లు వెల్లడించారు. 3వ తేదీ నుంచి యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందని తెలియజేశారు.

సకాలంలో సరుకుల పంపిణీ

• ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ


మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(దర్గామిట్ట): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సకాలంలో సరుకులను పంపిణీ చేయడమే లక్ష్యంగా అందరూ సమష్టి బాధ్యత తీసుకోవాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అధికారులు, రైస్, దాల్ మిల్లర్ల అసోసియేషన్, రేషన్ డీలర్ అసోసియేషన్, స్టాకిస్టుల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జేసీ మాట్లాడుతూ రైతు బజార్ల ద్వారా నాణ్యమైన బియ్యం, కంది పప్పును బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకు వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.181 ఉన్న కందిపప్పును రూ.150కు, అదే విధంగా కేజీ రూ.56 ఉన్న స్టీమ్ బియ్యంను రూ.48కు, రూ.52 ఉన్న పచ్చి బియ్యంను రూ.47కు అందిస్తున్నామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అంగన్‌వాడీలు, ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు మరింత మెరుగ్గా నిత్యావసరాలు అందించేందుకు సూచనలు స్వీకరించారు. సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, మధులత, డీఎస్ఓ వెంకటరమణ సివిల్ సప్లయీస్ డీఎం నరసింహం పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన కోవూరు ఎమ్మెల్యే

నెల్లూరు(క్రైమ్): పోలీసు అతిథి గృహంలో ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను గురువారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కోవూరు నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణ, మైపాడు బీచ్ వద్ద భద్రత, జాతీయరహదారి వెంబడి గస్తీ తదితర అంశాలపై చర్చించారు. ఎస్పీని కలిసిన వారిలో కళ్యాణ్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, వంశీకృష్ణారెడ్డి తదితరులున్నారు.

తల్లిపాలు అమృతం

• ప్రారంభమైన వారోత్సవాలు
• అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది
• ఈనెల 7వ తేదీ వరకు నిర్వహణ

ప్రాజెక్ట్ పరిధిలో..
మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు : 321
మినీ కేంద్రాలు : ఆరు


అంబాపురం టైలర్స్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నెల్లూరు సిటీ: పుట్టిన బిడ్డకు తల్లిపాలే అమృతం. శారీరక ఎదుగుదలకు అవి ఎంతగానో దోహదపడతాయి. నవజాత శిశువుకు బలం చేకూరుస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ విషయం తెలిసినా చాలామంది తల్లులు తమ పిల్లలకు ముర్రుపాలు ఇచ్చేందుకు ఇష్టపడడం లేదు. అప నమ్మకం, అభద్రతాభావం ఇలా అనేక కారణాలున్నాయి. ఫలితంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గి భవిష్యత్‌లో వ్యాధుల బారిన పడే అవకాశం లేకపోలేదు. తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ఐసీడీఎస్ అధికారులు ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తోంది. నెల్లూరు రూరల్ ప్రాజెక్ట్ పరిధిలో గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు మొదలయ్యాయి. ఈనెల 7వ తేదీ వరకు కార్యక్రమాలను నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

ఎంతో కీలకం

బిడ్డ పుట్టాక ఆరునెలలపాటు తల్లిపాలను ఆహారంగా ఇస్తే తేలికగా జీర్ణమవుతుంది. ఇవి శుభ్రంగా ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. రోజులో 8–10 సార్లు పాలివ్వాలని చిన్నపిల్లల వైద్యులు చెబుతున్నారు. పాలివ్వడం వల్ల బోలెడు ప్రయోజనాలున్నాయి. వాటిలో ప్రొటీన్లు లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి. పాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుంది. తెలివితేటలు బాగుంటాయి. డబ్బాపాలు తాగే పిల్లల కంటే చురుగ్గా ఉంటారు. బిడ్డకు పాలివ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెరుగుతుంది. ఆ తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. వారికి రొమ్ము, గర్భాశయ కేన్సర్లు రావు.

రూరల్ పరిధిలో..

➡ అంబాపురం సెక్టార్ టైలర్స్ కాలనీ – 2 అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.స్వరూప అధ్యక్షతన గురువారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను కార్యక్రమం ప్రారంభించారు. గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, ప్రమీల, లలితాకుమారి, లక్ష్మీమంజుల, హెల్పర్‌లు కామాక్షమ్మ హసీనా పాల్గొన్నారు.

➡ గాంధీనగర్ సెంటర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుజాల్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఏఎన్‌ఎం గీత, ఆశావర్కర్ సుస్మిత, కృష్ణప్రియ, విమలకుమారి, సులోచన తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్): స్థానిక సంతపేటలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య గురువారం తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ సిబ్బంది తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, డెమో శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో కనకరత్నం, డీపీహెచ్‌ఎన్‌ఓ మంజుల, డీపీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ పెద్దాస్పత్రిలోని తల్లి, పిల్లల (ప్రసూతి ఆస్పత్రి) విభాగంలో గర్భిణులు, బాలింతలకు గురువారం చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ జయచంద్ర నాయుడు అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలకు, తెలివితేటలకు తల్లిపాలే కారణమన్నారు. అందువల్ల అపోహలు వీడి ప్రతి తల్లి తమ బిడ్డలకు తల్లిపాలే ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎన్‌సీయూ నోడల్ అధికారి డాక్టర్ శివరాముడు, డిప్యూటీ హెచ్‌ఓడీ డాక్టర్ సుల్తానా, పీడియాట్రిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

• నెల్లూరు(వీఆర్సీసెంటర్): బాలాజీనగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన వారోత్సవాల్లో తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

• యనమలవారిదిన్నెలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ అన్నపూర్ణ పాల్గొని మాట్లాడారు.


నెల్లూరులో వారోత్సవాలు


పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న సిబ్బంది


గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో..


ప్రసూతి ఆస్పత్రిలో వారోత్సవాలు


వాల్‌పోస్టర్లను ప్రదర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ, అధికారులు

బీసీజీ టీకాతో టీబీకి చెక్


వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు


ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

• డాక్టర్ అరుణకుమారి

నెల్లూరు(అర్బన్): వయోజనులు బీసీజీ టీకాను వేయించుకుని టీబీ (క్షయ) రాకుండా రక్షణ పొందాలని రాష్ట్ర పరిశీలకురాలు, రాష్ట్ర పీపీఎం కో–ఆర్డినేటర్ డాక్టర్ అరుణకుమారి సూచించారు. గురువారం కోటమిట్ట అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో జరుగుతున్న బీసీజీ టీకాల తీరు, కుష్టు వ్యాధి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీతో కలిసి ఆమె మాట్లాడారు. షుగర్ వ్యాధిగ్రస్తులు, ఇంట్లో ఎవరికైనా టీబీ ఉండి మందులు వాడుతుంటే వారి సహాయకులు, 60 ఏళ్లు నిండిన వారు ఇలా ఆరు దశల్లో గుర్తించిన వయోజనులందరూ టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీ నివారణ, అర్బన్ హెల్త్ సెంటర్ల సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలన

నెల్లూరు సిటీ: రూరల్ మండలం కలివెలపాళెంలో బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను గురువారం రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ అరుణకుమారి, జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలీ, డీఆర్టీబీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాక్సినేషన్ గురించి ఆరా తీశారు. అరుణకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన వారందరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. అందరికీ అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కొడావత్ బలరామనాయక్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు సులభంగా అనుమతులు

• మంత్రి పొంగూరు నారాయణ


అర్జీ స్వీకరిస్తున్న నారాయణ

నెల్లూరు(బారకాసు): భవన నిర్మాణాలకు అనుమతులను వేగంగా, సులభతరంగా పొందేలా చర్యలు చేపట్టామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. పెండింగ్ భవన నిర్మాణాల దరఖాస్తులపై గురువారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో స్పెషల్ డ్రైవ్ జరిగింది. ఇందులో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ, రాష్ట్ర టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, జేడీ రాంబాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణాలకు సంబంధించి 76 పెండింగ్ అనుమతుల్లో 57 క్లియర్ చేశామన్నారు. గురువారం ఒక్కరోజే 10 దరఖాస్తులను పరిష్కరించినట్లు చెప్పారు. కార్పొరేషన్‌లో సంతకాల ఫోర్జరీ విషయాన్ని రూరల్ ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఇందులో ఎంతటి వారున్నా చర్యలు తీసుకుంటామన్నారు. జనసేన, బీజేపీ, కమ్యూనిస్ట్ పార్టీలకు చెందిన పలువురు నేతలు టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో గుంటూరు టౌన్ ప్లానింగ్ ఆర్డీ మధుకుమార్, నెల్లూరు సిటీ ప్లానర్ దేవికుమారి, నుడా వీసీ బాపిరెడ్డి, అడిషనల్ కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి సన్మానం


ఏఎస్సై దంపతులను సన్మానించిన ఏఎస్పీలు

నెల్లూరు(క్రైమ్): జలదంకిలో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన కె.దేవదానంను గురువారం జిల్లా పోలీసు కార్యాయలంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, శ్రీనివాసరావులు ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ పోలీసు శాఖలో సుదీర్ఘకాలం క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, కోశాధికారి టి.శ్రీనివాసులు, ఈసీ మెంబర్ ఎంజీఆర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న కళాంజలి సంగీత సంబరం


ఆహ్వాన పత్రికలను ప్రదర్శిస్తున్న లక్ష్మీప్రసన్న, అనంత్, కృష్ణకుమార్

నెల్లూరు(బృందావనం): కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పురమందిరంలో ఈనెల 4వ తేదీన కళాంజలి సంగీత సంబరం.. 37వ వార్షికోత్సవ సంగీతోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు గానం అకాడమీ డైరెక్టర్, సంగీత గురువు ఎ.లక్ష్మీప్రసన్న తెలిపారు. ట్రంకురోడ్డు ఆర్‌ఆర్ స్ట్రీట్ నర్తకి సెంటర్ దగ్గర ఉన్న గానం అకాడమీ కార్యాలయంలో కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆ సంస్థ వ్యవస్థాపకుడు కళాంజలి అనంత్, సభ్యుడు నాతా కృష్ణకుమార్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఔత్సాహిక గాయకులను ప్రోత్సహించాలనే సంకల్పంతో అన్నమయ్య కీర్తనలు, సినిమా పాటల పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పురమందిరంలో నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం 98489 59575 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా జీ లిటిల్ ఛాంప్స్ విజేత సాయివేద వాగ్దేవికి కళాంజలి అవార్డును ప్రదానం చేసి సత్కరిస్తామన్నారు. అలాగే పలు పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన జ్ఞానశ్రీ, అనూష, గాయత్రి, అజిత్ రామ్, శ్రీకృతి ఆధ్వర్యంలో స్వరఝురి కార్యక్రమం జరుగనుందన్నారు.

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం


సంబరాల్లో పాల్గొన్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ గురువారం జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని మూలాపేటలోని అరుంధతిపాళెంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మందా బాబ్జి ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పందింటి సుబ్బయ్యయాదిగ, మంద పెదబాబు, చిన్నప్ప, మల్లికార్జున, మాతయ్య, సతీష్ దితరులు పాల్గొన్నారు.

• సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అధ్యక్షుడు సుబ్బయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా చేస్తున్న పోరాటం సుప్రీం కోర్టు తీర్పుతో నెరవేరుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బద్దెపూడి రవీంద్ర, రఘు, రియాజ్, కన్యకేశ్వరరావు, డేనియల్, రేణుకా, రవి, సుబ్బారావు, చిన్నయ్య, పెంచలయ్య, కామేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు


కాగితంతో చేసిన క్రాఫ్ట్స్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నెల్లూరు(బృందావనం): నేషనల్ పేపర్ డే సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ, పేపర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీశ్రీ ఏజెన్సీస్ నెల్లూరు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో విద్యార్థులకు నిర్వహించిన పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి నాగసూరి మాట్లాడుతూ 500మందికి పైగా విద్యార్థులు తమ సృజనాత్మకతను బయటపెడుతూ పేపర్లతో వివిధ ఆకృతులను తీర్చిదిద్దారన్నారు. ప్రతిభ చూపిన 20 మందికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

రంగనాథ స్వామి ఆలయంలో ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో శ్రీఆండాళ్ తాయర్ తిరువాడిపూర ఉత్సవాలు విశేషంగా, భక్తిప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. ఆండాళ్ అమ్మవారికి గురువారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం ప్రాకారోత్సవం, మాలమార్పు, రాత్రి ఊంజల్‌సేవలను వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా సుంకుమనోహర్ వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

నడిరోడ్లే ఆటో స్టాండ్లు


సండే మార్కెట్ వద్ద ఇష్టారాజ్యంగా..

నెల్లూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో జాగా కనిపిస్తే.. ఆటోవాలాలు పాగా వేసి స్టాండ్లుగా మార్చేస్తున్నారు. ప్రధానంగా నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ, ఫత్తేఖాన్‌పేట, వీఆర్సీ, ముత్తుకూరు బస్టాండ్, గాంధీబొమ్మ, సండే మార్కెట్, ఆత్మకూరు బస్టాండ్‌లు, స్టోన్‌హౌస్‌పేట, రైల్వేస్టేషన్, హరనాథపురం తదితర ప్రాంతాల్లో రోడ్లపైనే ఆటోస్టాండ్లను ఏర్పాటు చేశారు. గంటల తరబడి అక్కడ వాహనాలను నిలుపుతూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. వీటిని కట్టడి చేయాల్సిన పోలీసు అధికారులు నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నారన్న విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

– నెల్లూరు(క్రైమ్)


చిన్నబజారు పోలీసుస్టేషన్ సమీపంలో..


పెట్రోల్ బంకు ఎదురుగా..


ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఇలా..


కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద


ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఇలా..